క్లుప్తంగా

త్వరలో గద్దర్ విగ్రహావిష్కరణ

పటాన్‌చెరు: తొలి, మలిదశ తెలంగాణ పోరాటాలలో కీలక భూమిక పోషించిన మహోన్నత వ్యక్తి, ప్రజా యుద్ధనౌక గద్దర్ 11 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమైంది. తెలంగాణ జాతికి గద్దర్ చేసిన సేవలను ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సొంత నిధులతో పటాన్‌చెరు పట్టణంలో గద్దర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఈ–తక్షిల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఫుట్‌బాల్, ఖోఖో, కరాటే పోటీల్లో ప్రతిభచూపి త్వరలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ శరత్‌కుమార్, పీఈటీ శ్రీనాథ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో రేణీత్, సారిక, వర్ష, సాయిస్ఫూర్తి, అమృతవర్షిణి, శ్రీనిధి ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్, పీఈటీ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా నర్సింహారెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న నర్సింహారెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణానికి చెందిన నర్సింహారెడ్డి ఇంపాక్ట్ వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా నియమితులయ్యారని ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ గంప నాగేశ్వర్‌రావు తెలిపారు. ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన ట్రైనర్ ది ట్రైన్ వర్క్‌షాప్ 114లో పాల్గొని 90 రోజులు ఆన్‌లైన్, రెండు రోజుల పాటు ఆఫ్‌లైన్ శిక్షణను పూర్తిచేసి ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాస ఉపన్యాసాలు అందించి ఆయా అంశాల్లో ప్రతిభ చూపడంతో ఎంపికయ్యారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణ చేతుల మీదుగా నర్సింహారెడ్డికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఖేడ్ ప్రాంత విద్యావంతులు అభినందించారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పరిధిలోని పొట్టిపల్లి, తంగడపల్లి గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలు, విజయాలను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో దళితుల అభివృద్ధికి మరెన్నో ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. మనువాద మతోన్మాదులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, ప్రభుత్వరంగ సంస్థలు, రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు తలారి మల్లేశం, నాయకులు శ్రీనివాస్, సురేష్, బాలరాజు, అశ్విక్, లక్ష్మణ్, నగేష్, శ్రీకాంత్, నరేష్, ఆనంద్, అనిల్, సంగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): అసైన్డ్ పట్టాదారులకు పంట రుణాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ డిమాండ్ చేశారు. పంట రుణాలను ఇవ్వాలని కోరుతూ మంగళవారం పటాన్‌చెరులోని కో– ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డె కృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ పట్టాదారు రైతులు కూడా పంటలను సాగు చేస్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వం స్పందించి కో ఆపరేటివ్ బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలను అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పర్వతాలు, నాగరాజు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రణాళికలతో ముందుకెళ్దాం

- అప్పుడే వ్యాధులు దరిచేరవు
- స్వచ్ఛ సంకల్పానికి అందరం కృషి చేద్దాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

సాక్షి ఫోన్ ఇన్

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి ప్రణాళికాబద్ధంగా ముందుకెళతామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కమిషనర్‌కు నేరుగా తమ సమస్యలను స్థానికులు వివరించారు. ఆయన కూడా సానుకూలంగా జవాబులు ఇచ్చారు.

రజకకేరీ పెద్దమ్మ భవానీ మందిరం ప్రాంతంలో దోమల బెడద ఎక్కువైంది. అలాగే డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

◆ వినోద, రజకకేరీ సదాశివపేట

కమిషనర్ : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. మురుగు కాల్వ పారుదలకు చర్యలు తీసుకుంటాం.

పట్టణంలోని కృష్ణానగర్, సుందరయ్య నగర్ కాలనీల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

◆ తాజోద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి, సదాశివపేట

కమిషనర్ : కృష్ణానగర్, సుందరయ్య నగర్ కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

సాయిరాంనగర్ కాలనీలో ఉన్న సత్యసాయి పాఠశాల సమీపాన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగి దోమలు, పందులకు నిలయాలుగా మారాయి.

◆ నల్లోళ్ల జయమ్మ, కాలనీ వాసి

కమిషనర్ : పట్టణ పరిధిలోని 26 వార్డుల్లో దోమల నివారణకు నూతనంగా ఐదు ఫాగింగ్ యంత్రాలు తెప్పిస్తున్నాం. దోమల నివారణకు, పందుల తరలింపునకు చర్యలు చేపడతాం.

ఫయాజ్‌నగర్‌లో కొద్దిపాటి వర్షానికి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. మురుగు నీరు నిల్వ ఉంటుంది.

◆ పూజ, సంధ్యరాణి, ఫయాజ్‌నగర్ కాలనీ

కమిషనర్: ప్రత్యేక బడ్జెట్‌లో రోడ్లు, మురుగు కాలువ నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం. అవి నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం.



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దాపూర్ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం ఎందుకు?

◆ పాండు, రఫియోద్దీన్ కృష్ణానగర్

కమిషనర్ : కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తాం.

రాఘవేంద్రనగర్ కాలనీ మహబూబ్‌పాష దర్గా పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది.

◆ షఫీయోద్దీన్, ముర్షత్ దర్గా

కమిషనర్ : పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

సుందరయ్య కాలనీలో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి.

◆ హాజం, సుందరయ్య కాలనీ

కమిషనర్ : పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో మురుగు కాలువలు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బడ్జెట్లో నిధులు కేటాయించి చర్యలు చేపడతాం.

ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమల తీవ్రత అధికంగా ఉంది. అలాగే కుక్కల బెడద కూడా ఎక్కువైంది.

సంతోష, సాయికుమార్, శ్రీదేవి, కృష్ణానగర్

కమిషనర్ : పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నాం. ఇప్పటికే పలు ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చాం. పరిశుభ్రతను పాటించాలని ఆదేశాలు జారీ చేశాం. దోమల నివారణకు వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేయిస్తా. కుక్కలను తరలింపు ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటాం.

అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్



పనులను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని సంగారెడ్డి నియోజవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ నస్రిన్ నసీర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాలు సైతం మెచ్చుకుంటున్నాయన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా కేవలం మన తెలంగాణాలోనే ఉందని తెలిపారు. అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని వివరించారు. కౌన్సిలర్ నస్రిన్ నసీర్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డులోని హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చౌదరి ప్రకాష్, కోఆప్షన్ సభ్యులు కలీంపటేల్, బీఆర్‌ఎస్ నాయకులు ముబీన్, సమీ, దప్పు నర్సింహులు, కామెల్, కరీం జబ్బార్, షఫీ, వాజీద్, రహీం, మహబూబ్, చంద్రసేన్, మల్లేశం, రియాజ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కంది(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సర్పంచ్ వేణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, ఉపసర్పంచ్ నరేష్‌గౌడ్, ఎంపీటీసీ చంద్రి శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి
- అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

జిన్నారం(పటాన్‌చెరు): అసంపూర్తి పనులను పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. అభివృద్ధి పనులను చేపడుతున్న తీరు, తదితర అంశాలపై మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లారంలో చేపట్టిన ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కౌన్సిలర్లు, అధికారులకు సూచించారు. శిఖం స్థలాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు లేకున్నా ఇంటి నెంబర్లను ఎలా కేటాయిస్తున్నారని కౌన్సిలర్లు, అధికారులపై మండిపడ్డారు. సమావేశంలో దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

సమ్మె నోటీసు అందజేత

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు మంగళవారం మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్, కామయ్యలు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు దిగుతున్నారని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరినా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీంతో తప్పని పరిస్థితిలో సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. నాయకులు దేవిదాస్, మాణిక్, తుకారాం పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఐఆర్ 18శాతం ప్రకటించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కల్హేర్(నారాయణఖేడ్): మధ్యంతర భృతిని సవరణ చేస్తూ 5శాతం పెంపునకు బదులుగా 18 శాతం పెంచుతూ ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిర్గాపూర్ మండల కేంద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎట్టకేలకు ప్రభుత్వం ప్రకటించిన నూతన పీఆర్‌సీ కమిటీని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పీఆర్‌సీ కమిటీని కాలయాపన చేయించకుండా తొందరగా నివేదికలు తెప్పించుకుని నూతన వేతన సవరణలు అమలు చేయాలని కోరారు. ఆదేవిధంగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికుల నియామకం చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు దిడ్డి జగన్నాథ్, నాయకులు రహీమ్, రాథోడ్ వెంకట్‌నాయక్, అయూబ్ పాల్గొన్నారు.

చేపల వేటను అడ్డుకోవాలి

సంగారెడ్డి టౌన్: సింగూరు బ్యాక్ వాటర్‌లో అడ్డగోలుగా చేపల వేట కొనసాగిస్తున్న వారిని అడ్డుకోవాలని కోరుతూ మత్స్యశాఖ ఏడీఓ సతీష్ కుమార్‌కు మత్స్యకారులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక మహారాష్ట్రకు చెందిన పలువురు అనుమతులు లేకుండా చేపల వేట కొనసాగిస్తున్నారని, పలుమార్లు హెచ్చరించినా వినకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి చేపల వేటను అరికట్టాలని కోరారు.

అధికారులతో సమీక్ష

సంగారెడ్డి మున్సిపాలిటీ: మంజీరా నీటి విడుదలపై ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంగళవారం సంగారెడ్డిలో మున్సిపల్ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి టౌన్‌లో నీటి సరఫరా కోసం రూ.44 కోట్లు విడుదల చేసిన నిధులను ఏవిధంగా ఉపయోగించాలనే అంశంపై చర్చించారు. నల్లబగడ్డ బొబ్బిలికుంట చెరువు డిస్మాండిల్ చేసినపుడు చెరువుకు ఆనుకొని ఉన్న 55 ఇళ్లు డ్యామేజ్ అయ్యాయని తెలిపారు. డ్యామేజ్ అయిన ఇళ్లకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షలు ఇవ్వాలని అధికారులకు కోరారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పబ్లిక్ హెల్త్ ఏఈ, మున్సిపల్ డీఈ ఇంతియాజ్, ఇరిగేషన్ డీఈలు పాల్గొన్నారు.

విత్తనాలకు ప్రతిపాదనలు

రాయికోడ్(అందోల్): రైతులకు యాసంగి వ్యవసాయ సీజన్‌లో అవసరమైన శనగ విత్తనాలు సరఫరా చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల్లో మండల కేంద్రానికి విత్తనాలు సరఫరా అవుతాయని తెలిపారు.

హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా

సంగారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కలెక్టర్ కార్యాలయం ఎదుట హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కమిషన్ కాన్ఫరెన్స్ 2015 నుంచి ఇప్పటివరకు నిర్వహించలేదన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించండి



నారాయణఖేడ్: మాట్లాడుతున్న సాయిలు



జిన్నారం: భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు

నారాయణఖేడ్: ఆశాకార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు చేపట్టిన సమ్మె మంగళవారంతో 8వ రోజుకు చేరుకొంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, పదవీ విరమణ తదితర ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఉపాధ్యక్షులు గంగా, ప్రశాంతి పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తూ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు బీజేపీ నేత ఉదయ్‌కుమార్ మద్దతు పలికారు.

అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు మద్దతు



సంజీవరెడ్డితో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు



అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ చిట్టిబాబు

నారాయణఖేడ్: అంగన్‌వాడీలు చేపట్టిన చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు మంగళవారం సంజీవరెడ్డి నివాసానికి ప్రదర్శనగా వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు అన్నదానం

వట్‌పల్లి(అందోల్): అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద అందోలు, జోగిపేట మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు అన్నదానం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు సరికాదన్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన కాంగ్రెస్ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఇందిర, మహిళా నాయకులు అరుణ, షేకమ్మ, సావిత్రి, ఈశ్వరమ్మ, అయ్యవ్వ పార్వతి, స్వప్న, సుజాత, అనసూయ, లలితమ్మ, సీపీఎం నాయకుడు విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం

సమ్మెకు సంఘీభావం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో అంగన్‌వాడీ చేపట్టిన సమ్మెకు బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బలరాం సంఘీభావం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతులపై బ్యాంకర్ల తీరు సరికాదు**

నారాయణఖేడ్: రైతు రుణమాఫీ విషయంలో రైతుల పట్ల బ్యాంకర్లు అవలంభిస్తున్న తీరు సరికాదని జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీకి సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేసినా బ్యాంకర్లు పాతబకాయిల కింద మినహాయించుకున్నామని చెబుతుండటం సరికాదన్నారు. మరికొంత మందికి సంబంధించి డబ్బులను హోల్డ్‌లో ఉంచారని వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రుణమాఫీ డబ్బులు అందేవిధంగా చూడాలని కోరారు.

◆ **మండలానికి చేరిన బతుకమ్మ చీరలు**

హత్నూర (సంగారెడ్డి): ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు పంపిణీ చేసే బతుకమ్మ చీరలు హత్నూర మండలానికి వచ్చినట్లు ఎంపీఓ సువర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మండలానికి 12,120 చీరలు వచ్చాయని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు.

◆ **సుభిక్షంగా ఉండాలి**

హత్నూర(సంగారెడ్డి): గణనాథుని దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం హత్నూర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ ఆశయ్య, నాయకులు పాల్గొన్నారు.

◆ **ఘన వ్యర్థాల పారబోత**



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలో గల ఆసానికుంటలో గుర్తుతెలియని వ్యక్తులు ఘన వ్యర్థాలతో కూడిన బ్యాగులను సోమవారం అర్ధరాత్రి పారవేశారు. దీంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై స్థానికులు మంగళవారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పీసీబీ అధికారులు దుర్గేష్ తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి నమూనాలను సేకరించారు. వాటిని పారవేసిన సదరు పరిశ్రమ లేదా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

◆ **మోకాళ్లపై కూర్చొని నిరసన**

సంగారెడ్డి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట పంచాయతీ టెక్నికల్ ఉద్యోగులు మంగళవారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారంతో 5వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ వినోద్‌కుమార్, పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ **వాహనాల తనిఖీ**

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని చిమ్నాపూర్ గ్రామంలో మంగళవారం ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్, ఇనురెన్స్ తదితర పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతూ పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ **కొనసాగుతున్న షేక్ షాబుద్దీన్ జాతర**

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్ గ్రామంలో దర్గా హజ్రత్ షేక్ షాబుద్దీన్ జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ చీఫ్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఖాజామియా, జమీలుద్దీన్, శుక్లవర్ధన్‌రెడ్డి, అర్షద్, అక్బర్ హుసేన్ దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా కృత్తికా నక్షత్ర వేడుకలు**

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనతో పాటు లలితా సహస్ర పారాయణం, వాసవీమాత చరిత్ర పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకోటి దయాకర్, దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉల్లింతల రాజు, కోశాధికారి బులకంటి మల్లేశం, ఉపాధ్యక్షుడు మ్యాడం రాధా కిషన్, కార్య నిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యా సాగర్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పాంపాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ **'నీలం'కు గణనాథుడి లడ్డూ అందజేత**

పటాన్‌చెరు టౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమీన్‌పూర్ మండలంలోని గండిగూడెం గ్రామంలో నవయుగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన గొల్ల రవికుమార్ యాదవ్ రూ.లక్షా 70 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. అయితే దక్కించుకున్న లడ్డూను మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్‌కు లడ్డూను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీతో సంబంధం లేకుండా నీలం మధు గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించాలని స్వామివారిని కోరి లడ్డూను దక్కించుకున్నట్లు తెలిపారు.

